# చిన్న కోరిక - పెద్ద కథ

రామారావు యన్టీ రామారావంత అందగాడు.

ఘంటసాలతో పోటీగా పాడగలిగిన గాయకుడు.

ఒలింపిక్ పోటీల్లో ఛాంపియన్‌గా గెలవగలిగిన ఆటగాడు.

చాలా తెలివైన వాడు

ఎంతో బుద్ధిమంతుడు.

కాని - రామారావ్ సినిమా యాక్టర్ గాడు.

నేపథ్య గాయకుడు కాడు.

ఒలింపిక్ ఛాంపియన్ అసలే కాడు.

ఒకానొక మహానగరంలో - అతి పెద్దదయిన ఒకానొక ప్రభుత్వ కార్యాలయంలో అతి చిన్న ఉద్యోగి రామారావ్.

బియ్యే చదివిన రామారావ్ చదువూ, అందమూ, తెలివితేటలూ, మంచితనమూ ఇతర శక్తిసామర్థ్యాలూ అన్నీ కూడా అతనికి గుమస్తాకి మించిన ఉద్యోగం ఇప్పించలేకపోయాయి

రామారావ్‌కి చదువు పూర్తయ్యాక రెండేళ్ళదాకా ఉద్యోగం దొరకలేదు.

కాని - చదువు పూర్తయిన ఏడాదికే పెళ్ళాడ్డానికి పిల్ల దొరికింది.

ఈ దేశంలో ఏమి దొరికినా దొరక్కపోయినా ఆడపిల్లలు మాత్రం అతి తేలిగ్గానే దొరుకుతారు.

అంత త్వరగా పెళ్ళి చేసుకోడం రామారావ్‌కి పాపం ఇష్టం లేదు.

కాని, తల్లిదండ్రుల మాట జవదాటలేక, తన సంపాదన కోసం ఎదురుచూస్తున్న తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ బ్రతికించడానికీ, పోషించడానికీ వాళ్లకి చదువులు చెప్పించడానికీ కావలసిన డబ్బు సంపాదించలేక అర్జంటుగా అందుక్కావలసిన డబ్బు సంపాదించడానికి మరో మార్గం లేక పెళ్ళి చేసుకున్నాడు - కట్నం కోసం.

ఈ దేశంలో పెళ్ళిళ్ళు కూడా ఆ చేసుకునే వాళ్ళ కోసం కాక ఇంకెవరికోసమో జరుగుతాయి.

ఇంకెందుకోసమో జరుగుతాయి.

రామారావు పెళ్ళి అలాగే జరిగింది.

రామారావు భార్య తెచ్చిన కట్నం డబ్బు అతని కుటుంబానికున్న అప్పులు తీర్చడానికీ, ఆపైన ఆర్నెల్లు బ్రతకడానికీ మాత్రమే సరిపోయింది.

ఆ తర్వాత ఇంకెలా బ్రతకాలో తెలీకుండానే మరో ఆర్నెల్లు బ్రతికిన తర్వాత రామారావుకి ఉద్యోగం దొరికింది.

అది కూడా అతి కష్టం మీద దొరికింది.

వాళ్ళ కాళ్ళూ వీళ్ళ కాళ్ళూ పట్టుకున్నాక, అప్పు చేసి అంతో ఇంతో నైవేద్యాలు పెట్టాక, అప్పుడు దొరికింది.

అంతేగాని ఆ గుమాస్తా ఉద్యోగం కూడా రామారావు అర్హతల్ని బట్టి దొరకలేదు. ఈ దేశంలో ఉద్యోగాలు అర్హతల్ని బట్టి దొరకవు. అర్హతలున్న వాళ్లందరికీ దొరకవు.

ఉద్యోగం దొరకడానికి ముందే, పెళ్ళయిన పదినెల్లకే రామారావుకి కొడుకు పుట్టాడు. ఈ దేశంలో ఉద్యోగాల్లేకపోయినా, తింటానికి తిండి లేకపోయినా పిల్లలు మాత్రం పుడుతూనే వుంటారు.

కొడుకు పుట్టిన రెండు నెలల తర్వాత రామారావుకి ఉద్యోగమొచ్చింది. ఆ తర్వాత ముచ్చటగా మూణ్ణెల్లు వెదికితేగాని, ఉద్యోగమొచ్చిన వూళ్ళో రామారావుకి అద్దె కొంప దొరకలేదు.

రామారావుకి దొరికిన కొంప చిన్నదే గాని, అద్దె మాత్రం చాలా పెద్దది. అంటే అతనికి వచ్చే జీతానికి చాలా పెద్దది. తనకొచ్చే జీతంలో నాలుగోవంతు అద్దెగా ఇచ్చి, మరో

నాలుగోవంతు ఇంటికి పంపుతూ మిగతా సగం జీతంతోనే సగం సగం బ్రతుకుతూ రోజులు గడుపుకొస్తున్నాడు రామారావు.

ఈ దేశంలో రోజంతా కష్టపడి పని చేసినా అందుకొచ్చే ప్రతిఫలం రోజులో సగం బ్రతకడానికి మాత్రమే సరిపోతుంది - చాలామంది విషయంలో. మరికొందరి విషయంలో అందుక్కూడా సరిపోదు.

ఇదంతా రామారావు పూర్వ కథ. ఇంక ఇప్పటి కథలో కొద్దాం.

రామారావు పూర్వకథకి ప్రస్తుత గాధకీ అట్టే తేడా లేదు. రామారావు ఉద్యోగంలో చేరి ఇప్పటికి అయిదేళ్ళు అయింది.

ఈ అయిదేళ్లలోనూ అతని జీతం యాభై రూపాయల్దాకా పెరిగింది. ఖర్చులు మాత్రం నూటయాభై రూపాయలు పెరిగాయి.

ఇంటి అద్దె పెరిగింది.

బియ్యం ధర పెరిగింది.

పాల ఖర్చు పెరిగింది.

పప్పులూ, ఉప్పులూ, నూనెలూ అన్నింటి ధరలూ పెరిగాయి.

ధరల విషయంలో మాత్రం ఈ దేశానిది ఎప్పుడూ పురోగమనమే. ధరలు మాత్రం ఎప్పుడూ వెనక్కి తిరిగి చూడకుండా పెరుగుతూనే వుంటాయి.

అన్నట్టు ఈ అయిదేళ్ళలోనూ రామారావుకి మరో ముగ్గురుపిల్లలు కూడా పుట్టారు. ధరలూ, పిల్లలూ, అవసరాలూ ఖర్చులూ తెగ పెరిగిపోయి జీతం యాభై రూపాయలు మాత్రమే పెరగటం ‹‹ - మరింత బరువు పెరగటం తప్ప రామారావు జీవితంలో ఈ అయిదేళ్ళలోనూ చెప్పుకోదగ్గ మార్పేమీ లేదు.

ఈ దేశంలో సామాన్యుల జీవితంలో ఎన్నేళ్ళు గడిచినా బాధలూ, బరువులూ పెరగటం తప్ప మరేమీ మార్పులుండవు. సామాన్యుల జీవితంలో చెప్పుకోదగిన స ఘటనలు కూడా ఏవీ వుండవు.

అవసరాలూ, అప్పులూ, అప్పుల కోసం తిప్పలూ, అప్పులు తీర్చడానికి తప్పులూ, బాధలూ, భయాలూ, కన్నీళ్ళూ - ఎప్పుడూ ఇవేగాని ఇంకేమీ వుండవు, రామారావు లాంటి వాళ్ళ జీవితాల్లో.

కాని - సామాన్యులకి కూడా కోరికలుంటాయ్. ఆ కోరికలూ, ఆశలూ, సరదాలూ కూడా సామాన్యంగానే వుంటాయ్. చిన్నవిగానే వుంటాయ్. అన్నట్టు కలలు కూడా వుంటాయ్

వాళ్ళ జీవితాల కంటే ఆ కలలే బాగుంటాయ్. పగటి కలలు ఇంకా బాగుంటాయ్.

సామాన్యులకి ఖర్చు లేకుండా కష్టపడకుండా దొరికేవి ఆ కలలు మాత్రమే. కొందరు దురదృష్టవంతులకి కలలు కూడా రావు. అది వేరే కథ.

సరే, కలల సంగతి వదిలేసి అసలు కథలో కొద్దాం.

అందరిలాగే రామారావు క్కూడా సామాన్యమైన కోరికలూ చిన్న చిన్న ఆశలూ అతి చిన్న సరదాలూ వున్నాయి.

రామారావుకి ఎప్పుడూ నలగని మాయని బట్టలు తొడుక్కోవాలనుంటుంది.

కాని అతని బట్టలెప్పుడూ మాసిపోయే నలిగిపోయే వుంటాయ్. అప్పుడప్పుడూ చిరిగిపోయి కూడా వుంటాయి.

రామారావుకి రోజూ ఉదయం ఆఫీసుకెళ్ళేటప్పుడు కిళ్ళీ వేసుకుని సిగరెట్ కాల్చుకోవాలనుంటుంది కాని అతని జేబులో వుండే డబ్బులు రోజూ కిళ్ళీ వేసుకోడానికీ సిగరెట్ కాల్చుకోడానికీ సరిపోవు. వాటికి సరిపోతే బస్సు టికెట్‌కి సరిపోవు.

రామారావుకి - రోజూ సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు హోటల్ కెళ్ళి టిఫిన్ తిని, స్ట్రాంగ్ కాఫీ తాగాలనుంటుంది.

కాని - ఎప్పుడో తప్ప ఆ సరదా కూడా రామారావుకి రోజూ తీరదు. చిన్నవే అయినా యింకా యిలాంటివే రామారావుకి చాలా కోరికలున్నాయి.

అవన్నీ కూడా ఎప్పుడో గాని ఎప్పుడూ నెరవేరవు.

అయినా ఇది రామారావు కోరికలకి సంబంధించిన కథ కాదు రామారావ్ భార్య కోరిన ఒక చిన్న కోరికకి సంబంధించిన కథ ఇది

రామారావు భార్య పేరు రాజ్యం.

అసలు పేరు రాజ్యలక్ష్మి.

రాజ్యం పెళ్ళి నాటికి - రామారావులాగే చాలా అందంగా వుండేది చాలా ఆరోగ్యంగా వుండేది. ఎప్పుడూ నవ్వుతూ వుండేది.

కాని రాజ్యం ఇప్పుడంత అందంగా లేదు అంత ఆరోగ్యం గానూ లేదు ఎప్పుడో గాని హాయిగా నవ్వదు

రామారావుకున్నట్టే అందరికీ వున్నట్టే రాజ్యానికి కూడా చిన్న చిన్న కోరికలూ, ఆశలూ, సరదాలూ, చాలా వున్నాయి.

రామారావు మగాడు గనక ఒకప్పుడు గాకపోతే మరొకప్పుడైనా అతని కోరికలూ, సరదాలూ, తీరతాయ్. రాజ్యానికి ఆ మాత్రం అవకాశం కూడా వుండదు.

ఈ దేశంలో మగాడి కోరికలూ, సరదాలూ తీరడానికుండే అవకాశాలు ఆడదాని కోరికలూ, సరదాలూ, తీరడానికుండవు.

అసలాడదానికి కోరికలేమిటి , సరదాలేమిటి అని కూడా అంటారు కొందరు.

తన కోరికలూ, ఆశలూ, సరదాలూ అన్నీ తనలోనే దాచుకుంటుంది గాని, భర్త ముందు కూడా అవేమీ సామాన్యంగా వెలిబుచ్చదు రాజ్యం. ఏదీ తొందరపడి అడగదు. అడిగినా అట్టే లాభముండదని ఆమెకి తెలుసు.

భర్త కష్టసుఖాలు రాజ్యానికి బాగా తెలుసు. సంసార భారాన్ని మొయ్యడానికి భర్త పడుతున్న బాధలు కూడా ఆమెకి తెలుసు. అందుకే భర్తని ఏమాత్రం ఇబ్బంది పెట్టడం కూడా రాజ్యానికి ఇష్టముండదు.

రాజ్యం పతివ్రత.

ఈ దేశంలో అన్నిటికీ కరువే అయినా, పతివ్రతలకి మాత్రం కరువు లేదు.

ఒకనాడు రాజ్యం రామారావుని ఒక చిన్న కోరిక కోరింది.

పట్టుచీర తెమ్మని కాదు.

బంగారపు నగ కొనిపెట్టమని కాదు.

సోఫాసెట్టు పట్టుకు రమ్మని కాదు.

"సినిమాకి తీసుకెళ్ళరా ?" అని అడిగింది రాజ్యం రామారావుని.

అది నిస్సందేహంగా చిన్న కోరికే. అయినా అది కూడా ఎప్పుడూ భర్తని అడగదు రాజ్యం ఏ ఆర్నెల్లకో ఏడాదికో భర్త తీసుకెళ్తే వెంటబడి వెళ్ళడమే గాని, తనంత తానుగా గాని మరొకళ్ళ వెంట గాని ఎప్పుడూ సినిమాలకి వెళ్ళదు రాజ్యం. ఇరుగూ పొరుగూ అమ్మలక్కల మాటలు వినీ, పత్రికల్లో ప్రకటనలూ, బొమ్మలూ చూసీ, ఎప్పుడైనా ఏదైనా సినిమా చూడాలనిపించినా కూడా చూపించమని సామాన్యంగా భర్తని అడగదు.

భర్త దగ్గర డబ్బులున్నాయో లేవోననీ, ఇద్దరికీ రిక్షాకీ, సినిమాకీ అయ్యే డబ్బు ఇంట్లో మరేదైనా ఖర్చుకి ఉపయోగపడుతుందనీ, పిల్లలు వెంటబడతారనీ - సినిమా చూడాలన్న తన కోరికని తరచుగా చంపుకుంటూనే వుంటుంది రాజ్యం.

అలాంటి రాజ్యం సినిమాకి తీసుకెళ్ళమని అడిగేసరికి రామారావు కూడా ఆశ్చర్యపోయాడు

"ఏమిటి కథ ? ఎన్నడూ లేనిది ఇవ్వాళ సినిమా అంటున్నావ్ ?" అని అడిగాడు.

పక్కింటి సుబ్బారావు పెళ్ళాం ఒక 'మహోజ్వల సాంఘిక చిత్ర' మొకటి చూసొచ్చి, ఆ సినిమా చాలా బాగా వుం  ఆ సినిమా చూస్తూ నువ్వు కూడా తప్పకుండా ఏడుస్తావనీ, అంచేత తప్పకుండా చూ  నీ రాజ్యానికి చెప్పింది. చెప్పి, ఆ సినిమా తాలూకు త్యాగాల కథ ఏడుస్తూ చెప్పింది.

రాజ్యం కథ వినే  చేసింది. ఏడ్చి, సినిమా ఎలాగైనా సరే చూడాలనుకుంది.

ఈ దేశంలో - మనుషుల్లో త్యాగబుద్ధి వుండదు.

సినిమాల్లో మాత్రం త్యాగాలు చచ్చినన్ని వుంటాయ్.

చాలా సి  ల్లో మనుషులుండరు.

దేవతలుంటారు.

దేశంలో లేకపోయినా, కొన్ని సినిమాల్లో సోషలిజం కూడా వుంటుంది.

తనకి సినిమా చూడాలనింపిచడానిగ్గల కథంతా చెప్పి, ఆ సినిమా కథ కూడా భర్తకి చెప్పింది రాజ్యం.

సినిమా కథ విని రామారావు ఏడవలేదు గానీ, భార్య సినిమా చూపించమని అడిగినందుకు మాత్రం అతనికి ఏడుపొచ్చినంత పనైంది.

ఆవేళ పన్నెండో తారీకు

ఆ నెల జీతంలో, ఆవేల్టికి రామారావు దగ్గర మిగిలింది రెండు రూపాయల అరవై మూడు పైసలు మాత్రమే.

మళ్ళీ ఎవడి కాళ్ళో పట్టుకుని అప్పు తెస్తే తప్ప మిగతా నెలంతా గడవదు.

ఇప్పుడు భార్యని సినిమాకి తీసుకెళ్ళాలంటే అయిదు రూపాయల్దాకా అవుతుంది.

అయిదు రూపాయలంటే మాటలా ? కాదు. అయిదు రూపాయల్తో ఇంటిల్లిపాదీ కరోజు తిండి తినొచ్చు. ఇంకో అయిదు రూపాయలు కలిపితే నెలంతా తన బస్సు ఛార్జీలకి రిపోతుంది. పెద్దవాడి స్కూల్ ఫీజుకి సరిపోతుంది. చంటిదాని పాలడబ్బాకి సరిపోతుంది.

అయినా ఏదోవిధంగా రాజ్యానికి సినిమా చూపించాల్సిందే. ఈవిధంగా ఎప్పుడూ తనని రు తెరిచి రాజ్యం అడగలేదు సినిమా చూపించమని.

కాని, ఇప్పుడు తన దగ్గర డబ్బుల్లేవు.

బాధపడ్తూ, సిగ్గుపడ్తూ "ఇప్పుడు డబ్బుల్లేవు. నాల్రోజుల్లో వెళ్దాంలే" అన్నాడు భార్యతో రామారావు.

రాజ్యం ఏమీ అనలేదు.

నాలుగురోజులన్నది వారమైంది. పదిరోజులైంది. పదిహేను రోజులైంది.

ఆ నెలంతా గడిచిపోయింది. ఫస్టు తారీకొచ్చింది. రామారావ్‌కి జీతమొచ్చింది. మరి పదిరోజులు గడిచాయి. ఆ జీతం కూడా ఖర్చయిపోయింది.

కాని రాజ్యం మాత్రం సినిమా చూళ్ళేకపోయింది.

ఇందులో రామారావు తప్పు కూడా ఏమీ లేదు పాపం. రాజ్యాన్ని సినిమాకి తీసుకెళ్ళడానికి చాలాసార్లు ప్రయత్నం చేశాడు. ఎప్పటికప్పుడు ఏవో అవాంతరాలొచ్చి ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు.

ఒకసారి వెళ్తే టికెట్లు దొరకలేదు.

ఇంకోసారి వెళ్ళడానికి అప్పు దొరకలేదు.

మరోసారి వెళ్దామనుకున్నప్పుడు రెండోవాడికి జ్వరమొచ్చి వారం రోజులదాకా తగ్గలేదు వాడి మందుల కోసం చేసిన అప్పు ఇప్పటికీ తీరలేదు.

ఒకసారి - వెళ్దామనుకున్నరోజున రాత్రి తొమ్మిదింటిదాకా ఆఫీసులో ఓవర్‌టైమ్ చెయ్యాలిసొచ్చింది. ఓవర్‌టైమ్ పని చేసినందుకు రావాల్సిన పదిరూపాయల చిల్లరా ఇప్పటికీ రానేలేదు.

ఇలాగే మరోసారీ మరోసారీ కూడా ఇంకేవో మరింకేవో ఇబ్బందులు, అవాంతరాలు

ఏమైతేనేం, రాజ్యం ఇప్పటికీ సినిమా చూడలేకపోయింది.

సినిమా చూసిన సుబ్బారావ్ పెళ్ళాన్నీ, చూడని రాజ్యాన్నీ ఏడిపించిన ఆ సినిమా - ఇంకా చాలా మంది ఆడవాళ్ళని ఏడిపిస్తూ ఇప్పటికీ ఆడుతూనే వుంది. వందరోజుల పండుగ కూడా చేసుకుంది. ఇంక ఏడ్చే వాళ్ళంతా అయిపోయాక, చివరికో రోజున - ఆ సినిమా వెళ్ళిపోయే రోజు కూడా వచ్చేసింది.

ఏమైనా సరే, ఆ రోజు భార్యని సినిమాకి తీసుకెళ్ళాలనుకున్నాడు రామారావు .

తీసుకెళ్తానని రాజ్యంతో చెప్పాడు కూడా.

"రాత్రికి భోజనం కూడా సరదాగా ఏదన్నా హోటల్లో చేద్దాం వంట చెయ్యకు పిల్లలకి మాత్రం పెట్టు" అని చెప్పాడు ఆఫీసుకెళ్ళే ముందు

అలాగేనంది రాజ్యం.

ఆ సాయంత్రం వంట చెయ్యకుండా పొద్దున వండిందే కాస్త మిగిల్చి పిల్లలకి పెట్టింది పెద్దవాళ్ళు ముగ్గుర్నీ బతిమాలీ బామాలీ తాము సినిమా కెళ్ళొచ్చేదాకా పక్కింట్లో వుండటానికి వాళ్ళని వొప్పించింది. సినిమాకి రాకుండా వుంటే రేప్పొద్దున్న నాన్న గారిచేత తలో పది పైసలూ యిప్పిస్తానని వాగ్దానం చేసింది.

సాయంత్రానికల్లా పనులన్నీ పూర్తి చేసుకుని, స్నానం చేసి, పెట్టెలో వున్న ఒకే ఒక దాపుడు చీర తీసి కట్టుకుంది. పక్కింట్లో పదిపైసలప్పుతీసుకుని పూలు కొని తల్లో పెట్టుకుంది. చంటిదానిక్కూడా నీళ్ళు పోసి, కొత్త గౌను తొడిగింది. భర్త కోసం ఎదురు చూస్తూ గుమ్మంలో కూర్చుంది

వస్తానన్న టైమ్‌కే ఇంటికి చేరాడు రామారావు కాని రావటమే ఏడుపు మొహంతో వచ్చాడు.

ఏమిటని అడగలేదు రాజ్యం మళ్ళీ ఏదో జరిగిందనుకుంది

రామారావే చెప్పాడు - "నాన్నకి చాలా జబ్బుగా వుందట వెంటనే కనీసం యాభై రూపాయలైనా పంపమని ఇంటిదగ్గర్నించి ఉత్తరమొచ్చింది" అని నా దగ్గర యిప్పుడు పదే వున్నాయి ఇంకో నలభై ఎక్కడన్నా అప్పు తేవాలి" అంటూ మళ్ళీ బయటికెళ్ళిపోయాడు

నానా తిప్పలూ పడి, నలుగురి కాళ్ళు పట్టుకుంటే గాని నలభై రూపాయల అప్పు దొరకలేదు రామారావుకి

రామారావు ఇంటికొచ్చేసరికి -రాజ్యం కొత్త చీర విప్పేసి, చింకి పాతలాంటి పాత చీరే కట్టుకుని, వంట చేస్తోంది

భార్య పక్కన చతికిలబడి కూర్చుని - "అప్పు దొరికింది గాని, సినిమాకి డబ్బులు మిగల్లేదు రాజ్యం! మళ్ళీ ఈసారి వచ్చినప్పుడు చూద్దాంలే లేకపోతే నాల్రోజులు పోయాక ఇంకేదైనా సినిమా చూద్దాం. " అన్నాడు రామారావు బాధగా. క్షమాపణ చెప్పుకుంటున్నట్టుగా

రాజ్యం కళ్ళలో నీరు నిండింది. పొగ వల్లనో, సినిమా చూళ్ళేదన్న బాధ వల్లనో రామారావు కర్థం కాలేదు.

సామాన్యులకి చిన్న చిన్న కోరికలే వుంటాయి కాని అవి కూడా ఎప్పుడూ తీరవు తీరకపోవడానికి వెనకాల పెద్ద పెద్ద కథలుంటాయి. ●

*(యువ మాస పత్రిక దీపావళి ప్రత్యేక సంచిక - 1973)*